క్లుప్తంగా

వైద్యశిబిరం



ములుగు రూరల్: మండలంలోని శివతండా, నొళ్యతండాలలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు జిల్లా టీబీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ పోరిక రవీందర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటుతో సంఘం అభివృద్ధి

ఎస్ఎస్‌తాడ్వాయి : ప్రభుత్వం ముదిరాజ్ కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో ముదిరాజ్ సంఘం అభివృద్ధి చెందుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లు దేవేందర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ కుల సంఘానికి ప్రత్యేక కార్పొరేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కుల సంఘం అభివృద్ధికి బాటలు వేసిన సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముదిరాజ్ కులస్తులను బీసీ డీ నుంచి బీసీ ఏ జాబితాలో చేర్చాలని కోరారు.

ఎస్సైని కలిసిన నాయకులు



గోవిందరావుపేట: పస్రా పోలీస్‌స్టేషన్ కొత్తగా వచ్చిన ఎస్సై అచ్చ కమలాకర్‌ను మండలం కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు వేర్వేరుగా మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సూరపనేని సాయికుమార్‌తో పాటు పలువురు ఎస్సైని శాలువాలతో సత్కరించి, బొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో కాంగ్రెస్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు దాసరి సుధాకర్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పన్నాల ఎల్లారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సీతారాం నాయక్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి లకావత్ నరసింహ నాయక్, మండల ప్రచార కార్యదర్శి రామారావు తదితరులు ఉన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



టేకుమట్ల: మండలంలోని వెలిశాల నవచైతన్య హై స్కూల్‌లో స్వయంపరిపాలన దినోత్సవ వేడుకలు బుధవారం నిర్వహించారు. విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. డీఈఓగా పప్పుల స్వాతిక, ఎంఈఓగా మారాటి మహాలక్ష్మీ, ప్రధానోపాధ్యాయులుగా గొప్పు హారిక, ఉపాధ్యాయులు గా ఎండీ రియా, అవంతిక, అపూర్వ, రోహిత్, పవన్ తేజ్, రమణకుమార్, వైష్ణవి తదితరులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యయులు రాం మధుకర్, కరస్పాండెంట్ కారుకూరి నారాయణ, ఉపాధ్యాయులు రాజేశ్వరి, సుమలత, నితీషా, నాగమణి, చైతన్య, చిరంజీవి, స్వరూప పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్



చిట్యాల: మండలంలోని జడల్‌పేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ప్రధానోపాధ్యాయురాలు కె.వాసంతి ఆధ్వర్యంలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఐదుగురు పోటీ చేయగా 9వ తరగతి చదువుతున్న బండి కార్తిక్ అనే విద్యార్థి గెలుపొందాడు. గెలుపొందిన విద్యార్థికి ధ్రువీకరణ పత్రం అందజేసి ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.పద్మ, వెంకటేశ్వర్లు, సంజీవ్, రామకృష్ణ, మధు, పాషా, హరిత, లక్ష్మి పాల్గొన్నారు.

సీఐని కలిసిన నాయకులు

చిట్యాల: ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ డి.మల్లేష్ యాదవ్‌ను బుధవారం కాంగ్రెస్ యూత్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లకొండ కుమార్, నాయకులు అందుగుల రాజు, గోపగాని శివ, చిరంజీవి, అజయ్, టి.నాగరాజు, లటికే రాజు ఉన్నారు.

ఇసుకాసురుల ఇష్టారాజ్యం!



గౌరారం వాగులో ఇసుక తవ్వకాలు జరుపుతున్న పొక్లెయినర్



క్వారీ నుంచి మట్టిని తరలిస్తున్న టిప్పర్లు

- వాగులో అక్రమంగా తవ్వకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

మంగపేట: ఏజెన్సీలో రైతుల పేరిట పట్టా భూముల్లో ఇసుక మేటల తొలగింపు పేరుతో అనుమతులు పొందిన కొందరు ఇసుక క్వారీల ఏర్పాటు కోసం ప్రభుత్వ నిబంధనకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని బోరునర్సాపురం, జొబ్బోనిగూడెం గ్రామాల మధ్య గల గౌరారం వాగులో ఇసుక క్వారీ ఏర్పాటు కోసం వారం రోజుల నుంచి పొక్లెయినర్‌లతో తవ్వకాలు జరుపుతున్నారు. బోరునర్సాపురానికి చెందిన కొందరు రైతుల పట్టా భూముల్లో ఏర్పడిన ఇసుక మేటలు తొలగించేందుకు అనుమతులు వచ్చాయని చెబుతూ ఏకంగా వాగులో ఇసుక తరలించేందుకు క్వారీ ఏర్పాటుకోసం తవ్వకాలు జరుపుతున్నారని స్థానికులు వాపోతున్నారు. పట్టా భూ ముల్లో ఇసుక తరలించేందుకు అనుమతులు పొందినా స్థానిక రెవెన్యూ, టీఎస్ఎండీసీ, మైనింగ్ అధికారులు హద్దులు ఏర్పాటు చేయకపోవడంతో ఇష్టానుసారంగా తవ్వకాలు జరుపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా వాగుకు సమీపంలోని పంట పొలాల్లో తవ్వకాలు జరుపుతూ టిప్పర్లతో మట్టిని తరలిస్తూ వాగుల్లో రోడ్లు పోస్తున్నట్లు స్థానికులు తెలుపుతున్నారు. రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టాలని కోరుతున్నారు.

విచారణ చేస్తున్నాం..

వాగులో ఇసుక క్వారీ కోసం తవ్వకాలు జరుపుతున్నారని, ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న విషయం రెండు రోజుల క్రితమే తెలిసింది. ఇసుక క్వారీ ఏర్పాటు, లేదా పట్టా భూముల్లో ఇసుక మేటలు తొలగించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన పత్రాలను చూపించాలని అప్పటి వరకు ఎలాంటి తవ్వకాలు జరుపవద్దని పనులను నిలిపివేశాం. పూర్తి స్థాయిలో విచారణ జరిపి అక్రమంగా తవ్వకాలు జరిపినట్లయితే చర్య తీసుకుంటాం.

– వీరస్వామి, తహసీల్దార్

‘నల్లెల’ మృతి తీరని లోటు



ములుగు : నల్లెల కుమారస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క



ములుగు రూరల్ : కుమారస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బలరాం నాయక్

ములుగు: నల్లెల కుమారస్వామి(కుమారన్న) మృతి తనకు, కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం కుమారన్న ప్రథమ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో నిర్వహించగా మంత్రి సీతక్క హాజరై చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుమారుడు నల్లెల భరత్, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ములుగు రూరల్: ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీకి నల్లెల్ల కుమారస్వామి మృతి తీరని లోటని కాంగ్రెస్ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ అన్నారు. బుధవారం మాజీ పార్టీ జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి హాజరై ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, ప్రధాన కార్యదర్శి ఇమ్మడి రాజుయాదవ్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్, యూత్ అధ్యక్షుడు బానోత్ రవిచందర్, పట్టణ అధ్యక్షుడు చింత నిప్పుల భిక్షపతి, పోడాల ఓంప్రకాష్, ఒజ్జల కళ్యాణ్, కంబాల రవి, ఓడ రాజు, కుతబోద్దిన్, రాజేశ్వర్ రావు, అహ్మద్‌పాషా తదితరులు ఉన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో ఎదగాలి



ఏటూరునాగారం : వీడ్కోలు సమావేశంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు



మంగపేట : సాంస్కృతిక కార్యక్రమంలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఏటూరునాగారం: విద్యార్థులు క్రమశిక్షణతో ఎదగాలని ప్రధానోపాధ్యాయుడు సాంబశివరావు అన్నారు. బుధవారం మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ఉత్తీర్ణత పొంది ఇంటర్‌లో ప్రవేశం పొందుతారన్నారు. ఈ తరగతులు జీవితానికి కీలకమని అన్నారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ సమాజంలో గుర్తింపు పొందాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సమ్మయ్య, సుమన్, రవి, నాగరాజు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మంగపేట: మండలంలోని రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం భాస్కర్‌రావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. 10వ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి వార్షిక పరీక్షల్లో అత్యధిక మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లా రాష్ట్ర స్థాయిలో గుర్తింపు సాధించాలని ఆకాంక్షిస్తు స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరా కొనసాగేలా చర్యలు



ఫిల్టర్‌ని తీసి మరోచోట పోయిస్తున్న నీరు

గోవిందరావుపేట : వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని ముందుగానే జాగ్రత్తపడి మండలంలోని రాఘవపట్నంలో పంచాయతీ కార్యదర్శి రంజిత్ మంచినీటి సరఫరా సక్రమంగా కొనసాగేలా చర్యలు తీసుకున్నారు. మంచినీటి వారోత్సవాల సందర్భంగా దయ్యాలవాగులో ఉన్న ఫిల్టర్ నుంచి గత కొద్ది కాలంగా మంచినీరు సరిగా రాకపోవడంతో పంచాయతీ కార్యదర్శి, గ్రామపెద్దల సహాయంతో దయ్యాలవాగులో ఉన్న ఫిల్టర్‌ని తీసి మరోచోట వేయడంతో మంచినీటి సరఫరా ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగుతోంది. గ్రామంలోని ప్రజలకు మంచినీటిని అందించినందుకు జీపీ సిబ్బందికి, సహకరించిన గ్రామ పెద్దలకు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్ హబీబ్ ఖాన్, గ్రామ పెద్దలు గొంది మొగిళి, తుమ్మల వెంకట రమణ, చిడం సాంబయ్య, మధు, గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వర్‌రావు

వాజేడు: యువత మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని ఎస్సై వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని కొంగాల గ్రామంలో బుధవారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ.. గంజాయి, గుడుంబా వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువుకోవాలని మంచి ఉద్యోగాలను సంపాదించుకోవాలన్నారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై వివరించారు. గ్రామస్తులు ప్రభుత్వ నిషేధిత విప్లవ సంఘాలకు, విప్లవ పార్టీలకు సహకరించవద్దని వాటికి సంబంధించిన వ్యక్తులు ఎవరైనా గ్రామంలోకి వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఫోక్సో చట్టంతో పాటు పలు చట్టాలపై అవగాహన కల్పించారు.

‘ఉపాధి’ కూలీలకు పనులు కల్పించాలి

పలిమెల: మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం 75 మంది కూలీలతో ఉపాధిహామీ పనులు చేయించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. టైమ్లీ పేమెంట్ కూడా పెంచాలని టెక్నికల్ అసిస్టెంట్లకు, పంచాయతీ కార్యదర్శులకు తెలిపారు. వన్ జీపీ వన్ నర్సరీ నందు 100 శాతం విత్తనాలు మొలకెత్తే విధంగా ప్రణాళిక చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీఓ ప్రకాశ్‌రెడ్డి, ఏపీఓ సునీత, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు



వాజేడు: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి నాటుసారా తెస్తున్న ఇద్దరిని పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. పేరూరు ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ సమయంలో ఛత్తీస్‌గఢ్ నుంచి జగన్నాథపురం గ్రామానికి చెందిన మాడుగుల ముసలయ్య, కొప్పుసూరుకు చెందిన కోగిల వెంకటేష్ ద్విచక్రవాహనంపై నాటుసారాను తీసుకొస్తున్నారు. వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసున్నట్లు ఎస్సై తెలిపారు.

డీఏ ప్రకటించకపోవడం బాధాకరం

ఏటూరునాగారం: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జరిగిన కేబినెట్ మీటింగ్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ ప్రకటించకపోవడం బాధాకరమని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యడ సురేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ కంటే ముందే డీఏను ప్రకటించాలన్నారు. పెండింగ్ బిల్లులను, నాలుగు డీఏలను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి, కాలయాపన చేసిందన్నారు. మళ్లీ ఇప్పుడు నూతన ప్రభుత్వం ప్రజా పాలనా అని చెప్పుకుంటున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నిర్లక్ష్యం చేయొద్దని తెలిపారు. వెంటనే డీఏను ప్రకటించాలని ఆయన కోరారు.

ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదు



కాటారం: మండలంలోని విలాసాగర్, గంగారం సమీపంలోని మానేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయాలని కోరుతూ బుధవారం ఆయా గ్రామాలకు చెందిన పలువురు తహసీల్దార్ నాగరాజుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేరు నుంచి అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా ఇసుక తోడి హైదరాబాద్‌కు లారీల ద్వారా రవాణా చేస్తున్నారని ఆరోపించారు. ఇసుక తవ్వకాల వల్ల రైతుల పంట భూముల్లోని బోర్లు ఎండిపోయి పంటలపై ప్రభావం పడుతుందని తహసీల్దార్‌కు విన్నవించారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో స్వామి, నయిమోద్దీన్, బాపు, జీవీఎస్ రావు, వాణి, రామచందర్ ఉన్నారు.

రుణాలు చెల్లించి రాయితీ పొందాలి



బ్యాంక్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు, గ్రూపు సభ్యులు

ఏటూరునాగారం: సకాలంలో రుణాలు చెల్లించి వడ్డీ రాయితీని పొందాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్‌బ్యాంక్ మేనేజర్ జేకే జాగోర్ అన్నారు. బుధవారం మండలంలోని చిన్నబోయినపల్లిలో మహిళా సంఘాల గ్రూపు సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జాగోర్, న్యాయవాది ఆఫీసర్ వీహెచ్ వెంకట సుబ్బయ్య హాజరై రుణాలు చెల్లించకపోతే జరిగే పరిణామాలను వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సభ్యులు ఐదుగురు కలిసి ఒకేసారి రుణం చెల్లిస్తే 50 శాతం వడ్డీ రాయితీ ఇస్తామని తెలిపారు. పంటరుణాలు తీసుకున్న సభ్యులందరూ రుణాలు మాఫీ అవుతాయని భావించి కట్టకపోవడంతో బకాయిలు పేరుకుపోతున్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో హరిత హారం లో భాగంగా ఏజెన్సీ గ్రామమైన చిన్నబోయినపల్లి ఫారెస్ట్ అధికారులు భూములను అడ్డుకొని దున్ననివ్వకుండా పంట చేసుకొని ఇవ్వకుండా చేయడం వలన మీరు బకాయిలు చెల్లించలేదని రైతులు సారయ్య, ఫత్తెమహ్మద్ తెలిపారు. మా రుణాలు సివిల్ అటాచ్ చేయొద్దని రైతులు, గ్రూపు సభ్యులు విన్నవించారు. సమావేశంలో డీఓ శ్రీరామచంద్రమూర్తి, ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సర్వర్ జయంతి వేడుకలు



సర్వర్ శాంతి స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సర్వర్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు

ములుగు రూరల్: అణగారిన వర్గాల విముక్తి కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి సర్వర్ అని మహబూబాబాద్ సబ్‌రిజిస్ట్రార్, సర్వర్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎండీ తస్లీమా మహ్మద్ అన్నారు. బుధవారం మండలంలోని రాంచంద్రాపురంలో సర్వర్ 74వ జయంతి సందర్భంగా ఆయన శాంతిస్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిరుపేదల అభ్యున్నతికి తన తండ్రి అహర్నిశలు పాటుపడ్డాడని అన్నారు. ఆయన ఆశయాల కొనసాగింపు కోసమే సర్వర్ చారిటబుల్ ట్రస్టు, ఫౌండేషన్ ఏర్పాటు చేసి నిరుపేదలకు సహాయ సహకారాలు అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో దొంతి రాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సాయిరెడ్డి, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

పండ్ల పంపిణీ

సర్వర్ జయంతి సందర్భంగా ములుగు ఏరియా ఆస్పత్రిలో సర్వర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆస్పత్రిలో రోగులకు ట్రస్టు సభ్యులు పండ్లు పంపిణీ చేశారు.

పేరివిజన్ కమిషనర్‌ను కలిసిన ఏటీఎఫ్ నాయకులు



పేరివిజన్ కమిషనర్‌ను కలిసిన ఏటీఎఫ్ నాయకులు

వెంకటాపురం(కె): పే రివిజన్ కమిషనర్ శివశంకర్‌ను బుధవారం ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల శ్రీనివాసరావు, కార్యదర్శి కబ్బాక రవి, ఉపాధ్యక్షుడు పీర్ల కృష్ణబాబు ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా వారు ఏజెన్సీలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఇంటి అద్దె అలవెన్స్‌లు, అదనపు అలవెన్స్‌లు, స్పెషల్ కాంపెన్సరీ అలవెన్స్ స్లాబ్‌రేట్లను పెంచాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఏజెన్సీలో ప్రస్తుతం ఇస్తున్న అలవెన్స్‌లు తక్కువగా ఉండటంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు మైదాన, పట్టణ ప్రాంతాల్లో పనిచేయడానికి బదిలీ వెళ్తున్నారన్నారు. కలిసిన వారిలో ఏటీఎఫ్ రాష్ట్ర నాయకులు కోరం సంతోష్ కుమార్, బొగ్గుల లక్ష్మయ్య, పూనెం రమేష్, కారం రాంబాబు, దిలీప్ రాజు తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న పస్రా ఎస్సై అచ్చ కమలాకర్

గోవిందరావుపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై కమలాకర్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మండల పరిధిలోని దుంపెల్లిగూడెం గ్రామ ప్రజలతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. గ్రామంలోని శాంతి భద్రతలు కాపాడటంలో ప్రజల తోడ్పాటు అవసరం అన్నారు. గ్రామాల్లో ఏదేని నేరం జరిగితే వెంటనే తెలియజేయాలన్నారు. పంట పొలాలకు విద్యుత్ తీగలు పెట్టడం గురించి, గతంలో జరిగిన సంఘటనల దృష్ట్యా తీగల ద్వారా ఎటువంటి ప్రమాదాలు భవిష్యత్‌లో జరగకుండా ముందు జాగ్రత్త చర్యలో భాగంగా ప్రజలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో దుంపెల్లిగూడెం గ్రామ ప్రజలు, పస్రా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలోని ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థులకు గంజాయి, మాదక ద్రవ్యాలపై పస్రా ఎస్సై కమలాకర్ బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎస్సై మాట్లాడుతూ.. విద్యార్థులు గంజాయి, మాదక ద్రవ్యాలకు ఆకర్షితులై జీవితాలు నాశనం చేసుకోవద్దని అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాలి



ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఎస్సై అశోక్

వెంకటాపురం(కె): మండల పరిధిలోని కొమురం భీం కాలనీ ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలుగా ఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూములను గిరిజనేతరులు ఆక్రమించుకోవాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న ఎస్సై అశోక్ సంఘటన ప్రాంతానికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనకు భూమిపూజ



కన్నాయిగూడెం: మండలంలోని బుట్టాయిగూడెంలో బొడ్రాయి ప్రతిష్ఠాపనలో భాగంగా బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఎంపీపీ జనగం సమ్మక్క, మాజీ సర్పంచ్ కావిరి పద్మ, కొబ్బరికాయకొట్టి పనులు ప్రారంభించారు. కాగా, బొడ్రాయి నిర్మాణానికి కుమ్మరి అంకుమళ్లు, హన్‌మాన్ గుడికి జాడి రాజు, జనగం బంగారి భూమిని దానంగా అందజేశారు. అలాగే బొడ్రాయి ప్రతిష్ఠాపన కమిటీ అధ్యక్షుడిగా మారగోని రాజును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కావిరి సంతోష్, చిన్నికృష్ణ, జాడి రాంబాబు, సాంబశివరావు, సురేందర్, కావిరి సమ్మయ్య, తాడూరి శ్రీధర్, పోషయ్య, కారోబార్ సమ్మయ్య, దీపక్‌రాజు, బాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.